జాబిలిపై అడుగిడిన క్షణాన..

40 రోజుల ఉత్కంఠకు తెర దించుతూ విక్రమ్ ల్యాండర్ చందమామపై అడుగిడిన ఆ క్షణం.. భారతీయుల ఆనందానికి ఆకాశమే హద్దయింది. చంద్రయాన్–3 విజయవంతం కావడంతో అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జయహో భారత్.. సాహో ఇస్రో అంటూ యువకులు, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచారు. చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ దిగుతున్న ప్రక్రియను ఇస్రో ప్రత్యక్ష ప్రసారం చేయడంతో అనేకమంది టీవీలకు అతుక్కుపోయారు. మరికొంతమంది తమ మొబైల్ ఫోన్లలోని యూ ట్యూబ్ ఛానెళ్లద్వారా ఈ ప్రసారాన్ని వీక్షించారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ దిగిన వేళ దేశమంతా చప్పట్లతో మార్మోగిపోయింది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై త్రివర్ణ పతాకం రెపరెపలాడిన వేళ ఆ మరపురాని ఆ మధుర క్షణాలను.. ఆ అనిర్వచనీయమైన అనుభూతిని వ్యక్తం చేశారిలా..


చంద్రయాన్–3 సక్సెస్ కావడంతో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో విద్యార్థుల కేరింతలు


విక్రమ్ ల్యాండింగ్ చిత్రాలను వీక్షిస్తున్న కణితి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గాజువాక/అక్కిరెడ్డిపాలెం: చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ సురక్షితంగా ల్యాండ్ కావడంతో అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలను 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మింది జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో విద్యార్థులు.. ఐఎఫ్‌పీ బోర్డుల్లో చంద్రుడిపై విక్రమ్ ల్యాండింగ్ దృశ్యాలను ఆసక్తిగా తిలకించారు. చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా జరుగుతున్న దృశ్యాలను తిలకించి హర్షాతిరేకాలతో కేరింతలు కొట్టారు. అక్కిరెడ్డిపాలెం హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, మింది జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.రమణ పాల్గొన్నారు. చంద్రయాన్–3 మిషన్ విజయవంతమైన వేళ గాజువాక బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు.

ఇస్రోకు విశాఖ స్టీల్‌ప్లాంట్ సెల్యూట్

ఉక్కునగరం: చంద్రయాన్–3 విజయవంతం కావడంపై స్టీల్‌ప్లాంట్ హర్షం వ్యక్తం చేసింది. చంద్రయాన్ విజయానికి విశేషంగా కృషి చేసిన ఇస్రోకు గర్వంగా సెల్యూట్ చేస్తున్నట్టు ప్రకటించింది. చంద్రయాన్–3 సాఫ్ట్ ల్యాండింగ్ విజయంలో అంకితభావంతో పనిచేసిన ఇస్రో బృందానికి అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు.

కణితి హైస్కూల్లో చిత్రలేఖన పోటీలు

కూర్మన్నపాలెం: మిషన్ చంద్రయాన్ –3 లైవ్ ప్రోగ్రామ్‌ను కణితి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. అంతకు ముందు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు చంద్రయాన్–3పై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. వారిలో డి. మేఘన (10వ తరగతి) ప్రథమ బహుమతిని, బి. విజయకుమార్ (10వ తరగతి) ద్వితీయ బహుమతిని, వై.దుర్గాప్రసాద్ (9వ తరగతి) తృతీయ బహుమతిని గెలుచుకున్నారు. విజేతలను హెచ్‌ఎం బి.సూర్యప్రకాశరావు, డ్రాయింగ్ టీచర్ బి.వి.నాయుడు, పీడీ మన్నాజీ, ఇతర ఉపాధ్యాయులు అభినందించి, బహుమతులు ప్రదానం చేశారు.

ఇస్రో అక్షర రూపంలో విద్యార్థులు

పెదగంట్యాడ: ఇస్రో అక్షర రూపంలో నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఒదిగిపోయారు. ముందుగా పాఠశాల ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం హిందుస్తాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయుడు ఎస్.ప్రశాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఇస్రో పేరుతో ప్రదర్శన ఆకట్టుకుంది.

ప్రతి భారతీయుడు గర్వించేరోజు

గాజువాక: ప్రతి భారతీయుడు గర్వించే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు అద్భుతమైన విజయాన్ని అందించారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. చంద్రయాన్–3 విజయం సాధించిన నేపథ్యంలో అగనంపూడిలోని పిల్లల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. అంతరిక్షంలో అఖండ విజయాన్ని సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఇది ప్రతి భారతీయుడు గర్వంతో ఉప్పొంగిపోయే క్షణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఇస్రో అక్షర రూపంలో నడుపూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు


పిల్లల మధ్య సంబరాల్లో ఎమ్మెల్యే నాగిరెడ్డి


జాతీయ జెండాతో బీజేపీ నాయకులు

విద్యార్థులకు ప్రేరణ



చంద్రయాన్–3 ద్వారా ఇస్రో సాధించిన ఈ విజయం యువ శాస్త్రవేత్తలు, విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుంది. ఈ విజయం ప్రపంచ దేశాల్లో భారత దేశానికి ప్రత్యేక స్థానం తీసుకువచ్చింది. సెల్యూట్ ఇస్రో.. సెల్యూట్ భారత్.

–కె.సంజీవరావు, స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్

శాస్త్రవేత్తల కృషి విద్యార్థులకు స్ఫూర్తి



భారతదేశం అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్రను సృష్టించింది. ఇస్రో శాస్త్రవేత్తల కృషి అమూల్యం. దేశమంతా ఉత్కంఠంగా ఎదురు చూస్తున్న చంద్రయాన్–3 విజయక్షణాలను మా పాఠశాల విద్యార్థులు కూడా చివరివరకు వీక్షించారు. ఈ అద్భుత విజయం వెనుక శాస్త్రవేత్తల కృషి, విద్యార్థులకు స్ఫూర్తినిస్తుంది.

– అరుణ, ఉపాధ్యాయిని, కణితి జిల్లా పరిషత్ హైస్కూల్

దేశం తలెత్తుకునేలా..



జాతి గర్వపడేలా.. దేశం తలెత్తుకొనేలా మన శాస్త్రవేత్తలు చంద్రయాన్–3 ప్రయోగించి విజయం సాధించారు. మన దేశ శాస్త్రవేత్తలు ప్రపంచ శాస్త్రవేత్తలను తలదన్నేలా చంద్రయాన్‌ను సృష్టించి గర్వకారణంగా నిలిచారు. దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన స్వదేశీ నౌక కావడం విశేషం.

– వి.సునీల్‌కుమార్, అగనంపూడి కళాశాల ప్రిన్సిపాల్

ఇది చారిత్రాత్మక విజయం



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు అపూర్వ విజయాన్ని సాధించారు. చంద్రునిపై చంద్రయాన్–3 కాలు మోపడం ఉద్వేగపూరితమైన విజయం. 14 రోజులపాటు విక్రమ్ నిర్వహించే పరిశోధనలు కూడా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాం.

– ఎ.బాలరెడ్డి, చైర్మన్, ఓక్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్

జయహో భారత్



చంద్రయాన్–3 మిషన్ సవాలుతో కూడుకున్నది. ఇది దేశానికి పెద్ద విజయం. చంద్రునిపై విక్రమ్ ల్యాండింగ్‌తో దక్షిణ ధ్రువంపై దిగిన మొదటి దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించడం గర్వంగా ఉంది. ఇస్రో శాస్త్రవేత్తలకు భారతీయులందరి అభినందనలు.

– టి.బలరామకృష్ణ, చైర్మన్, టీఎస్సార్, టీబీకే విద్యా సంస్థలు

మేరా భారత్ మహాన్



చంద్రయాన్–3ను విజయవంతం చేసి ప్రపంచ అంతరిక్ష పరిశోధనా రంగంలో భారత్ సరికొత్త చరిత్ర లిఖించింది. భారతదేశ సత్తాను ప్రపంచ దేశాలకు చాటిన శాస్త్రవేత్తలకు అభినందనలు. ఈ రోజు యావత్ భారతదేశానికి పండగ రోజు. మేరా భారత్ మహాన్.

– ఎస్.ప్రశాంత్, స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్, నడుపూరు జెడ్పీ హైస్కూల్

ఇస్రో టీమ్‌కు అభినందనలు



చంద్రయాన్–3 సక్సెస్ కావడం ఆనందంగా ఉంది. మా విద్యార్థులు విక్రమ్ ల్యాండింగ్‌ను ఆసక్తిగా చూశారు. ఇటువంటివి వీక్షించడం వలన విద్యార్థులకు పరిశోధనలపై ఆసక్తి వస్తుంది. ఇస్రో టీమ్‌కు మా విద్యార్థులందరి తరఫున అభినందనలు.

– సూర్యప్రకాశరావు, కణితి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం

క్లుప్తంగా

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

అగనంపూడి: అగనంపూడి లయన్స్‌క్లబ్ నూతన కమిటీ బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. అగనంపూడిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా మిత్తిపాటి జగదీష్, కార్యదర్శిగా ఆడారి వెంకటకృష్ణ, కోశాధికారిగా యార్లగడ్డ నాగదుర్గా ప్రసాద్, జిల్లా చైర్‌పర్సన్లుగా కిడిమి హనుమంతురావు, గుదే సుశీలా గజేంద్రరావు, పొన్నగంటి నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా డాక్టర్ వి.వి.రామారావు, గోరు గోవిందరావు, ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి ఎం.మస్తాన్‌రెడ్డి, బత్తుల కాళిదాస్ ప్రమాణస్వీకారం చేశారు. క్లబ్ పూర్వ గవర్నర్ లయన్ డి.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో గాజువాక, కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ, అనకాపల్లి కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో పాము కలకలం


పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వెనుక భాగంలో పాము కలకలం రేపింది. బుధవారం ఉదయం ఆలయం వెనుక ఉన్న ఇంట్లో పాము కనిపించింది. దీంతో ఆ ఇంట్లోని కుటుంబీకులు భయాందోళన చెందారు. వెంటనే ఉక్కునగరంలోని స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న కిరణ్‌కుమార్, దాగి ఉన్న సుమారు ఐదు అడుగులు పొడవైన పామును పట్టుకున్నారు. దీంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. పామును అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తానని కిరణ్ తెలిపారు.

ఘనంగా టంగుటూరి జయంతి


ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వెంకటరమణ, పాఠకులు

పెదగంట్యాడ: టంగుటూరి ప్రకాశం పంతులును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథాలయ అధికారి వెంకటరమణ అన్నారు. ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్, అనిల్, పాఠకులు పాల్గొన్నారు.

చేనేత ఫెడరేషన్ సభకు సుబ్బారెడ్డికి ఆహ్వానం


సుబ్బారెడ్డితో చేనేత వృత్తిదారుల సంఘాల నాయకులు

గాజువాక: ఈ నెల 27న గాజువాకలో నిర్వహించనున్న ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్, చేనేత వృత్తిదారుల సభకు ఆ సంఘాల నాయకులు వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని ఆహ్వానించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ, రాష్ట్ర వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు తదితరులు సుబ్బారెడ్డిని కలిసి తమ సభకు రావాలని ఆహ్వానించారు. ఆహ్వాన పత్రం అందించినవారిలో నాయకులు కొలిపాక అప్పారావు, ఆడెం సూరి అప్పారావు, నావాన సింహాచలం, డాక్టర్ రాజు, గుదే వేణు తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఔదార్యం

రూ.లక్షన్నరతో పాఠశాలలో సైకిల్ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం


రేకుల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, పూర్ణ

అగనంపూడి: పాఠశాలలో విద్యార్థుల సైకిళ్లు పార్క్ చేసేందుకు రేకుల షెడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పూర్ణానందశర్మ ముందుకు రావడం అభినందనీయమని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైకిల్‌స్టాండ్ వద్ద షెడ్ నిర్మాణానికి బుధవారం ఉదయం భూమి పూజ చేశారు. పాఠశాలకు సుమారు 150 మంది వరకు విద్యార్థులు సైకిళ్లపై పాఠశాలకు వస్తున్నారు. వీరి సైకిళ్లు ఎండకు ఎండి, వానకు తడుస్తుండడాన్ని గమనించిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, తిప్పల దేవన్‌రెడ్డి యువసేన ప్రతినిధి జి.పూర్ణానందశర్మ (పూర్ణ) స్పందించి రూ.లక్షన్నర వ్యయంతో రేకుల షెడ్లు నిర్మించేందుకు ముందుకు వచ్చారు. అందులో భాగంగా బుధవారం ఉదయం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వరలక్ష్మి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాటలోనే వైఎస్సార్‌సీపీ నాయకులు నడుస్తూ, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. పూర్ణ మాట్లాడుతూ రెండు వార్డుల పరిధిలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టే అవకాశాన్ని భగవంతుడు తనకు కల్పించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు, కమిటీ చైర్మన్ బంధం అప్పలనాయుడు, వ్యాపారవేత్త డాక్టర్ దుర్గా ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం


మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: పేదల సంక్షేమానికి ప్రాధ్యానతనిస్తూ, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడుపుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం సచివాలయ పరిధి సంతమామిడితోట, శాతవాహన నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వార్డు వైస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, వాడపల్లి రామచంద్రరాజు, వెలుగుల పరశురాముడు, మాటూరి శ్రీనివాసరావు, చేగొండి శ్రీనివాసరావు, శ్రీనివాస్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘గంగవరం పోర్టును స్తంభింపజేస్తాం’


సంఘీభావం తెలియజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోతే పోర్టును స్తంభింపజేస్తామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. స్థానిక సమతానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు అధికారులు, గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులతో చర్చలు జరిపామన్నారు. కార్మికుల డిమాండ్లను పూర్తి స్థాయిలో పోర్టు యాజమాన్యం పరిష్కరిస్తామని చెప్పడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, కార్పొరేటర్లు గంగారావు, దల్లి గోవింద్, గంధం శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, సీపీఐ నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, సీపీఎం నాయకుడు కేఎం శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకుడు కొవిరి అప్పలరాజు తదితరులు కార్మికులకు మద్దతు ప్రకటించారు.

కష్టపడి పని చేసేవారికి సముచిత స్థానం


నిర్మలా కిశోర్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

గాజువాక: కష్టపడి పని చేసే కార్యకర్తలకు బీజేపీలో సముచిత స్థానం లభిస్తుందని ఆ పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలా కిశోర్ అన్నారు. మహిళా మోర్చా అధ్యక్షురాలుగా రెండోసారి పదవి చేపట్టిన అనంతరం విశాఖ వచ్చిన ఆమెకు గాజువాకలో ఆ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు రేలంగి శ్రీదేవి, లక్ష్మీ ప్రసన్న, ఉమ్మిడి సుజాత, గూటూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీ ఆకస్మిక తనిఖీ

అగనంపూడి చెక్‌పోస్టులో సిబ్బంది పనితీరుపై ఆరా


చెక్‌పోస్టులో సిబ్బందిని మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ వర్మ

అగనంపూడి: విశాఖ నగర పోలీస్ కమిషనర్ సి.ఎం.త్రివిక్రమ వర్మ బుధవారం రాత్రి నగర శివారు అగనంపూడి సమీపంలోని ఏడు మెట్ల మర్రిపాలెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది పనితీరును పరిశీలించారు. చెక్‌పోస్టులో వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనకాపల్లి మీదుగా నగరంలోని గంజాయి అక్రమ రవాణా జరగకుండా నిరంతర నిఘా ఉంచాలని, కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు పటిష్టంగా చేపట్టాలన్నారు. అప్రమత్తంగా ఉంటే నగరంలోకి గంజాయి చొరబాటు ఉండదన్నారు. సీపీ వెంట సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత


గణపతికి ఆర్థిక సాయం అందిస్తున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలో నివాసం ఉంటున్న గురుస్వామి గణపతి పెంకుటిల్లు కూలిపోవడంతో ఆ కుటుంబానికి పలువురు ఆర్థిక సహకారం అందించారు. 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ రూ.10 వేలు, 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి 35 వేల రూపాయలను లతీష్ చేతుల మీదుగా గణపతికి అందజేశారు. కార్యక్రమంలో కాకి రామిరెడ్డి, జగదీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాల్లో త్వరలో పెనుమార్పులు

గాజువాక: రాష్ట్ర రాజకీయాల్లో త్వరలో పెనుమార్పులు చోటు చేసుకోనున్నాయని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ అన్నారు. తమ పార్టీలో చేరిన నాయకులను గాజువాకలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. గాజువాకలో సమస్యలను, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించే అంశాన్ని వారాహి యాత్ర సందర్భంగా పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దల్లి గోవింద్‌రెడ్డి, నాయకులు కోన తాతారావు, బొలిశెట్టి సత్య, గంధం వెంకటరావు, తిప్పల రమణారెడ్డి, కరణం కనకారావు తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు!

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పరిధి ఆటోనగర్, రాంనగర్, పెదగంట్యాడ, గాజువాకల్లోని పలు స్క్రాప్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారని సమాచారం. బుధవారం ఉదయం నుంచి ఆయా ప్రాంతాల్లోని దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించినట్లు తెలిసింది.

28 నుంచి ఉమామహేశ్వరస్వామి ఆలయ వార్షిక వేడుకలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని కర్రివానిపాలెం సంతోషి ఉమామహేశ్వరస్వామి ఆలయ 28వ వార్షికోత్సవ కరపత్రాన్ని ఆలయ కమిటీ ఆవిష్కరించింది. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దాసరి సన్యాసిరావు, లక్ష్మి దంపతులు ఈ కరపత్రాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలను వివరించారు. గ్రామ నాయకులు నెల్లి శ్రీనివాసరావు, బలిరెడ్డి శ్రీను, సత్యనారాయణ, ఎల్వీ రమణ, దానబాల పైడికొండ, బి.అప్పారావు, పి.వసంతరావు, పి.రవి తదితరులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. ప్రజల ఆకాంక్షకు కేంద్ర ప్రభుత్వం విలువనిచ్చి పార్లమెంట్‌లో ప్రకటన చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 923వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అందరూ కలిసి రావాలని కోరారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు దృఢ సంకల్పం అవసరం


లైఫ్ స్కిల్స్ మోటివేటర్‌ను సత్కరిస్తున్న రత్తయ్య

అగనంపూడి: లక్ష్య సాధనకు దృఢ సంకల్పం అవసరమని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో జీవన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి ఒక లక్ష్యం ఉంటుందని, వాటిని సాధించడానికి సంకల్పంతో పాటు కృషి అవసరమన్నారు. లైఫ్ స్కిల్స్ మోటివేటర్ సీహెచ్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో ఏ కోర్సు చేసినా పరిశ్రమలకు అవసరమైన కోర్సులు నేర్చుకోవాల్సి ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ ఉన్నత ఆశయంతో ముందుకు వెళ్తే జీవితం ఆశాజనకంగా, ఆనందమయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మోటివేటర్లు రంజిత్‌షా, రవికిరణ్, యోగిత, విజ్ఞాన్ సీఈవో శ్రీకాంత్, రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, డీన్లు సతీష్, హరీష్‌కుమార్ తదితరులు మాట్లాడారు.

ఉక్కు కార్యదర్శి పర్యటన వివరాలు బహిర్గతం చేయాలి

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు కార్యదర్శి నరేంద్ర నాథ్ సిన్హా స్టీల్‌ప్లాంట్ పర్యటన వివరాలు బహిర్గతం చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతుండగా మరోవైపు కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమయంలో ప్లాంట్‌కు వచ్చిన కేంద్ర కార్యదర్శి ఆ అంశాలపై ఎటువంటి ఎటువంటి ప్రస్తావన లేకుండా వెళ్లిపోవడం ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. ఆయన ఏ విషయంపై ప్లాంట్‌కు వచ్చారో యాజమాన్యం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొమ్ము ప్రసాద్, బీఎంకె నాయక్, ఎస్.ఎ. నాయుడు, సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే 95 శాతం పూర్తి


బీఎల్వోకు నగదు బహుమతి అందజేస్తున్న లక్ష్మారెడ్డి

గాజువాక: ఓటర్ల జాబితాలపై చేపట్టిన సర్వే 95 శాతం పూర్తయిందని గాజువాక ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకలో 3,12,057 మంది ఓటర్లకు గాను 2,96,454 మంది ఓటర్లకు సంబంధించిన సర్వే పూర్తయిందని తెలిపారు. ఓటర్ల సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నారు. పోలింగ్ బూత్ నంబర్ 159 బీఎల్వో సునీతకు ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రకటించిన రూ.10వేల నగదు బహుమతిని ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ ఈఈ ప్రసాద్‌బాబు, తహసీల్దార్లు పాల్ కిరణ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.